# పట్టాలెక్కని పెట్టుబడులు!

- ఒక్క ఒప్పందమూ కార్యరూపం దాల్చలే!
- ఒప్పందాల విలువ రూ. 2లక్షల కోట్లకు పైమాటే
- ప్రభుత్వ ప్రకటనలు ఘనం.. ఫలితాలు శూన్యం
- ఆచరణలో విఫలమంటూ సర్వత్రా విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): రాష్ట్రానికి కనీవినీ ఎరుగని రీతిలో పెట్టుబడులు తెచ్చినట్టు ప్రభుత్వం గొప్పలు చెబుతున్నప్పటికీ అందులో కార్యరూపం దాల్చినవి మాత్రం ఒక్కటీ కనపడడంలేదు. రెండు సార్లు దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులు, సింగపూర్, అమెరికా, తాజాగా జపాన్ పర్యటన సందర్భంగా ఒప్పందాలు జరిగినట్టుగా ప్రభుత్వం ప్రకటించింది. అవన్నీ కాగితాలకే పరిమితమైనట్టుగా క్షేత్రస్థాయిలో పరిస్థితులు కనిపిస్తున్నాయి. పెట్టుబడుల కోసం చేస్తున్న పర్యటనలకు కోట్లాది రూపాయల ప్రజాధనం ఖర్చవుతున్నా, వాటితో ఫలితాలు మాత్రం రావడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగావకాశాలను అందుబాటులోకి తేవడంతోపాటు పన్నుల రూపంలో ఆదాయం పెంచుకునే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడుల కోసం కృషి చేయడం సహజం. అనేక రకాల ప్రోత్సాహకాలు, పన్ను రాయితీలు కల్పించి పరిశ్రమలను ఆకర్షిస్తుంటాయి. చేసుకున్న ఒప్పందం కాగితాలు దాటి కార్యరూపం దాల్చినప్పుడే ప్రభుత్వ కృషి సార్థకమైనట్టు భావించవచ్చు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రచార ఆర్భాటమే తప్ప క్షేత్రస్థాయిలో ఎటువంటి పురోగతి కానరావడంలేదనేది పరిశ్రమ వర్గాల విమర్శ. ప్రభుత్వం చెబుతున్న పెట్టుబడి లెక్కలు, ఏర్పాటవుతున్న పరిశ్రమలను పరిశీలిస్తే ఈ విమర్శ నూటికి నూరుపాళ్లు వాస్తవమని చెప్పక తప్పదు. ఎందుకంటే.. రెండు దఫాలు దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సు సందర్భంగా జరిగిన ఒప్పందాలు ఇంతవరకు ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ఏదైనా పరిశ్రమ ఏర్పాటు కావాలంటే కొంత సమయం పడుతుందనడంలో సందేహం లేదు. అయితే, ఒప్పందం జరిగాక సదరు కంపెనీ తమ పరిశ్రమకు సంబంధించిన ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించడం, ప్రభుత్వం దాన్ని పరిశీలించి ఆమోదం తెలపడం, అందుకు అనుగుణంగా వారికి కావాల్సిన భూముల కేటాయింపు, రాయితీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేయడం వంటి ప్రక్రియ జరగాల్సి ఉంటుంది. అయితే, ఇవేవీ జరుగుతున్న దాఖలాలు లేవు. రెండుసార్లు దావోస్ పర్యటనలు, సింగపూర్, అమెరికా పర్యటనలు, తాజాగా జపాన్ పర్యటన అన్నీ కలుపుకొని రూ. 2లక్షల కోట్లకుపైగా పెట్టుబడి ఒప్పందాలు జరిగినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ప్రతిసారీ పర్యటనకు సీఎం, మంత్రిసహా పెద్ద సంఖ్యలో అధికార యంత్రాంగం విదేశాలకు వెళ్తున్నది. ప్రతి పర్యటనకూ రూ. 10-20కోట్ల వరకూ ప్రజాధనం ఖర్చవుతున్నది.


### ఒప్పందాల వరకే..

సహజంగా పరిశ్రమ ఏర్పాటుకు అనుమతులు, రాయితీల కోసం టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకుంటారు. అన్నీ సవ్యంగా ఉంటే అనుమతుల మంజూరీతోపాటు భూ కేటాయింపు జరుగుతుంది. ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలకు సంబంధించి... ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం టీజీఐఐసీ అధికారులు సదరు కంపెనీని సంప్రదించి వారినుంచి పరిశ్రమకు సంబంధించిన ప్రతిపాదనలు తీసుకుంటారు. అయితే, ఒప్పందాల తరువాత ఈ ప్రక్రియేదీ జరగడంలేదు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందాలు టీజీఐఐసీకి రావడంలేదని అధికారులు చెబుతున్నారు. అంతేకాదు, ఇలా ఒప్పందాలు చేసుకున్నవారు సొంతంగా కూడా టీఎస్ ఐపాస్ ద్వారా దరఖాస్తు చేసుకోవడంలేదని వారు పేర్కొంటున్నారు. 'ఒప్పందాలు చేసుకున్న కంపెనీలను మేము ఫాలోఅప్ చేస్తున్నాం. వారు వస్తాం.. వస్తాం, డీపీఆర్‌లు ఇస్తాం అని చెబుతున్నారు కానీ రావడంలేదు. మేము వారిని బలవంతం చేయలేం కదా'. అని ఓ అధికారి పేర్కొన్నారు.

### అంతా వివాదాస్పదం

మరోవైపు, ప్రభుత్వం చేసుకుంటున్న ఒప్పందాలు చాలావరకు వివాదాస్పదం అవుతున్నాయి. ఉర్సా క్లస్టర్స్ కంపెనీకి కనీసం చిరునామా కూడా లేదనే ఆరోపణలు వెల్లువెత్తగా, మారుబేనీ ఇండియా కంపెనీపై పలు దేశాల్లో కేసులు నమోదైనట్టు తేలింది. అంతేకాదు, ఒప్పందాలు చేసుకున్న చాలావరకు కంపెనీలు గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చినవే కావడం విశేషం. అవి తదుపరి విస్తరణ కోసం ప్రస్తుత ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నప్పటికీ అవేవీ ఇంకా కార్యరూపం దాల్చడంలేదు.

## కొన్ని ముఖ్య ఒప్పందాల పురోగతి ఇలా...



| కంపెనీ | పెట్టుబడి(రూ. కోట్లలో) | ప్రస్తుత స్థితి |
|---|---|---|
| అమెజాన్ వెబ్ స్వీసెస్, ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డాటా సెంటర్లు | 60,000 | విస్తరణ, పురోగతి లేదు |
| సన్ పెట్రో కెమికల్స్ | 45,500 | పురోగతి లేదు |
| కంట్రోల్ ఎస్ డాటా సెంటర్ క్లస్టర్ | 10,000 | పురోగతి లేదు |
| మేఘా ఇంజినీరింగ్ పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజక్టు | 15,000 | పురోగతి లేదు |
| టిల్మాన్ గ్లోబల్ డాటా సెంటర్ | 15,000 | పురోగతి లేదు |
| అదానీ గ్రూపు | 12,400 | (బీఆర్‌ఎస్ ప్రభుత్వం తిరస్కరించింది) పురోగతి లేదు |
| గోడీ ఇండియా | 8,000 | గతంలో కూడా ఒప్పందం, పురోగతి లేదు |
| జేఎస్‌డబ్ల్యూ | 9,000 | విస్తరణ, పురోగతి లేదు |
| వెబ్‌వర్క్స్ | 5,200 | విస్తరణ, పురోగతి లేదు |
| గోద్రేజ్ | 1,270 | విస్తరణ, పురోగతి లేదు |
| టాటా గ్రూప్ | 1,500 | విస్తరణ, పురోగతి లేదు |
| అరజెన్ లైఫ్ సైన్సెస్ | 2,000 | విస్తరణ, పురోగతి లేదు |
| సర్జికల్ పరికరాలు | 231.5 | పురోగతి లేదు |
| బీఎల్ ఆగ్రోసహా ఇతర కంపెనీలు | 630.5 | పురోగతి లేదు |
| ఎస్టీ టెలీ మీడియా గ్లోబల్ డాటా సెంటర్ | 3,500 | కొత్తది, పురోగతి లేదు |
| క్యాపిటల్యాండ్ ఐటీ పార్క్ అభివృద్ధి | 450 | గతంలో కూడా ఒప్పందం, పురోగతి లేదు |
| హెసీఎల్ టెక్ సెంటర్ ఏర్పాటు ఒప్పందం (3.20లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం) | - | విస్తరణ, పురోగతి లేదు |
| విప్రో గోపన్‌పల్లి క్యాంపస్‌లో ఐటీ సెంటర్ | - | విస్తరణ, పురోగతి లేదు |
| ఇన్ఫోసిస్ పోచారం ఐటీ క్యాంపస్‌లో కొత్త సెంటర్ ఏర్పాటు | - | విస్తరణ, పురోగతి లేదు |

### రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు

దావోస్ పర్యటన(2024) రూ.40,232కోట్లు

దావోస్ పర్యటన(2025) రూ.1,78,950కోట్లు

సింగపూర్ పర్యటన(2025) రూ.3,950కోట్లు

జపాన్ పర్యటన(2025) రూ.12,062కోట్లు

---

పరిహారానికి పైసల్లేవంటూనే..

## ప్రచారానికి 28 కోట్లు దుబారా!

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల పంట నష్టం జరిగి నెల రోజులు గడుస్తున్నా పరిహారంపై ఇప్పటివరకు సడీసప్పుడు లేదు. దీంతో సర్కారు తీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతులకు పరిహారం ఇవ్వాలన్న ఆలోచన చేయకుండా.. మాఫీ, భరోసా అయిపోయినట్టుగా ఆగమేఘాలపై రూ.28 కోట్లు ప్రచారానికి విడుదల చేయడంపై అన్నదాతలు దుమ్మెత్తి పోస్తున్నారు.

### పరిహారం ప్రకటనలకే పరిమితం

గత నెలాఖరుతోపాటు ఈ నెల మొదట్లో అకాల వర్షాలు, వడగండ్ల వానలు కురవడంతో భారీగా పంట నష్టం జరిగింది. మార్చిలో కురిసిన వర్షాలకు 11,298 ఎకరాల్లో, ఈ నెల మొదట్లో కురిసిన వర్షాలకు 14,956 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆ మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. పంటలు నష్టపోయి పుట్టెడు కష్టాల్లో ఉన్న రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నష్టపరిహారం చెల్లించే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. రైతుల పట్ల రేవంత్ సర్కారుకు ఏమాత్రం ప్రేమ లేదని స్పష్టమవుతున్నది.

### ప్రచారానికి రూ.28 కోట్లు

రుణమాఫీ, రైతుభరోసా అమలు సక్రమంగా లేకపోవడంతో రేవంత్‌సర్కారుపై అన్నదాతలు నమ్మకం కోల్పోయారు. రైతులు నమ్మడం లేదని ప్రభుత్వం ఆ రెండు పథకాలపై ప్రచారానికి దిగింది. రుణమాఫీ, రైతుభరోసా లబ్ధిదారుల పేర్లతో ప్రతి గ్రామంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందుకు ఇటీవల రూ. 28 కోట్లు విడుదల చేసింది. కాగా అకాల వర్షాలతో జరిగిన పంట నష్టానికి పరిహారం పంపిణీ చేసేందుకు రూ.26.25 కోట్లు అవసరమవుతాయి. నిధులు లేక పరిహారం పంపిణీ అంశాన్ని పక్కన పెట్టినట్టు సమాచారం. దీంతో చేయని రుణమాఫీ, అమలుకాని రైతుభరోసాపై ప్ర చారం కోసం రూ.28 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం ఆ నిధులను పంట నష్టపరిహారం చెల్లింపునకు వెచ్చిస్తే సరిపోయేవి కదా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

---




ఓయూలోని ఆర్ట్స్ కాలేజీ నుంచి పరిపాలనా భవనం వరకు ర్యాలీగా వెళ్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జేఏసీ నేతలు

## కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె ఉధృతం

- 12 వర్సిటీల్లో 5 రోజులుగా నిరవధిక సమ్మె
- ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ర్యాలీ
- ఆర్ కృష్ణయ్య, పాపిరెడ్డి, ఎమ్మెల్యే శంకర్ మద్దతు
- మా పోస్టులు రెగ్యులర్ చేస్తారా? లేదా?
- కాంట్రాక్టు అధ్యాపకుల జేఏసీ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను వెంటనే క్రమబద్ధీకరించాలన్న డిమాండ్‌తో కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. క్లాసులు బహిష్కరించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో తమ సమ్మెను ఉధృతం చేస్తున్నట్టు వారు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా బుధవారం పోలీసుల ఆంక్షల నడుమ ఆర్ట్స్ కాలేజీ నుంచి పరిపాలనా భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్యతో పాటు అదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్, ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కాంట్రాక్టు అధ్యాపకుల పోస్టులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. వర్సిటీల్లో బోధన నిలిచిపోయిందని, విద్యావ్యవస్థను కాపాడాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో యూనివర్సిటీల్లో హక్కుల గురించి మాట్లాడే పరిస్థితి లేకుండాపోయిందని మండిపడ్డారు. జీవోలు, పోలీసులతో పరిపాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ పరుశురామ్, డాక్టర్ బైరి నిరంజన్, కుమార్, రఘువీర్‌రెడ్డి, ఉపేందర్, సురేశ్‌నాయక్, శ్రీశైలం, భూమయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## నాపై క్రిమినల్ కేసు కొట్టేయండి

### హైకోర్టును ఆశ్రయించిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ) : బీజేపీ దాఖలు చేసిన పరువు నష్టం కేసు కొట్టేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టేయాలని కోరారు. నిరుడు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కొత్తగూడెంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర సభలో.. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుందన్న ప్రకటనతో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను మోసం చేశారని, బీజేపీ పరువు దెబ్బతీసేలా మాట్లాడారని రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు నాంపల్లి కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విచారణ చేపట్టింది. రాజకీయ కక్షతో చేసిన ఫిర్యాదు మేరకు నమోదైన కేసును కొట్టేయాలంటూ రేవంత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

---



ఎండిన పొలంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న నిర్మల్ జిల్లా కామోల్ రైతులు

## సాగుకు నీళ్లియ్యాలని వినూత్న నిరసన

### ఎండిన పొలంలో మోకాళ్లపై నిలబడి ఆందోళన

భైంసా టౌన్, ఏప్రిల్ 23 : పంటలకు నీళ్లివ్వాలని కోరుతూ నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని కామోల్ గ్రామానికి చెందిన రైతులు బుధవారం పొలంలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు పరిధిలో దాదాపు 200 ఎకరాల్లో వరి, 25 ఎకరాల్లో జొన్న, 25 ఎకరాల్లో నువ్వులు సాగయ్యాయి. దాదాపు 100 మంది రైతులు సాగు చేశారు. కెనాల్ ద్వారా నీటిని వదలకపోవడంతో పొట్ట దశకు వచ్చిన వరి, జొన్న, నువ్వుల పొలాలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి పంటలకు నీరు వదలాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

## 'క్రమశిక్షణ' కొరడా!

- ఆరుగురు పీసీసీ పరిశీలకుల తొలగింపు
- సమావేశానికి గైర్హాజరు, ఆలస్యంపై వేటు
- ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి సంచలన నిర్ణయం
- ఎమ్మెల్యే శ్రీహరి సహా మరో ఐదుగురి

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తేతెలంగాణ): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీలో క్రమశిక్షణపై దృష్టిపెట్టిన ఆమె బుధవారం గాంధీభవన్‌లో నియోజకవర్గాల పరిశీలకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కొందరు పరిశీలకులు ఆలస్యంగా వచ్చారు. దీంతో వారిని పరిశీలకులుగా తొలగించినట్టు మీనాక్షి ప్రకటించారు. సమావేశానికి రాని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు మరో ఐదుగురు నేతలను పరిశీలకులుగా తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 70 మంది పరిశీలకులకు ఆహ్వానం అందగా హాజరుకాని వారిని తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇదే సమావేశంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. పార్టీలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలని సూచించిన ఆమె, 2017 నుంచి పార్టీలో ఉన్న వాళ్లకే కమిటీలో చోటు ఉండేలా చూడాలని స్పష్టం చేసినట్టు తెలిసింది.

## 2017 నుంచి ఉన్నవాళ్లకే కమిటీల్లో చోటు

### ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తేతెలంగాణ) : 2017 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వాళ్లకే కమిటీల్లో చోటు కల్పించాలని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశించారు. కమిటీల్లో మహిళల ప్రాధాన్యం పెంచుకోవాలని సూచించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన బుధవారం గాంధీభవన్‌లో పీసీసీ పరిశీలకుల సమావేశం జరిగింది. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్, సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 25 నుంచి 30 వరకు జిల్లాస్థాయి సమావేశాలు జరుగనున్నట్టు మీనాక్షి నటరాజన్ తెలిపారు.

### ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం

మీనాక్షి నటరాజన్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. డీసీసీ, బ్లాక్, మండల కమిటీల ఎంపికకు పీసీసీ పరిశీలకుల నియామకంపై చర్చించారు. అంతకు ముందు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మీనాక్షితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇటీవల పార్టీ సీనియర్ నేత జానారెడ్డిపై ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చకు వచ్చినట్టు సమాచారం. అనంతరం రాజగోపాల్‌రెడ్డి.. జానారెడ్డి ఎపిసోడ్‌పై స్పందించారు. 'జానారెడ్డి అంటే తనకు గౌరవం. ఆయన మా పార్టీ సీనియర్ నేత. జానారెడ్డి రాసిన లెటర్‌పై ఒక సభలో మాట్లాడాను. తనకు మంత్రి పదవి అనేది అధిష్ఠానం తీసుకునే నిర్ణయం' అంటూ చెప్పుకొచ్చారు.

---

# తాగునీటికి కటకటే!

- డెడ్‌స్టోరేజీకి చేరువలో ప్రాజెక్టులు
- మిషన్ భగీరథతో అనుసంధానమైన పలు రిజర్వాయర్లదీ అదే దుస్థితి
- ఐదు జిల్లాలకు తాగునీళ్లు అందించే పాలేరు జలాశయం పరిస్థితి మరీ దారుణం
- కలవరపెడుతున్న మంచినీటి సమస్య
- ముందస్తు జాగ్రత్తలు పట్టని సర్కారు



తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంటలో రోడ్డుపై ఖాళీ బిందెలు, డ్రమ్ములతో రాస్తారోకో చేస్తున్న గ్రామస్థులు

### వివిధ ప్రాజెక్టుల్లో డెడ్ స్టోరేజీ లెవల్, ప్రస్తుత లెవల్

| ప్రాజెక్టు | డెడ్ స్టోరేజీ | ప్రస్తుత లెవల్ |
|---|---|---|
| ఎస్సారెస్పీ | 320 మీటర్లు | 324 మీటర్లు |
| శ్రీశైలం | 834 అడుగులు | 833 అడుగులు |
| నాగార్జునసాగర్ | 510 అడుగులు | 519 అడుగులు |



హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రిజర్వాయర్లతో పాటు మిషన్ భగీరథ రిజర్వాయర్లు సైతం అప్పుడే డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. భూగర్భ జలాలు కూడా అంతకంతకూ పడిపోతున్నాయి. వెరసి రాబోయే రెండు నెలల పాటు తాగునీటికి తిప్పలు తప్పని దుస్థితి నెలకొన్నది. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తున్నది. కృష్ణాతోపాటు గోదావరి నదీ పరివాహక ప్రాంతంలోని జలాశయాల్లో సైతం నీటి నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో గత నెల 23న 22 టీఎంసీల నీళ్లు ఉండగా, ప్రస్తుతం 11.88 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. నెలలోనే దాదాపు 11 టీఎంసీల మేర నీటినిల్వలు పడిపోయాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ లెవల్ 320 మీటర్లు కాగా, ప్రస్తుతం 324 మీటర్ల వరకే నీళ్లున్నాయి. నీటి నిల్వలు మరో నాలుగు మీటర్లు పడిపోతే, ఎస్సారెస్పీ డెడ్ స్టోరేజీకి చేరుకుంటుంది. అదే జరిగితే, నీటిని విడుదల చేయడం కష్టమే. ఒకవేళ చేసినా ప్రాజెక్టులో భారీగా సిల్ట్ ఉన్న కారణంగా బురదే వస్తుందని అధికారులు చెప్తున్నారు. ఈ ప్రాజెక్టు నుంచి వేసవి తాగునీటి అవసరాలకు ప్రతి నెలా అర టీఎంసీ నీళ్లు అవసరం. రాబోయే రెండు నెలలకు ఒక టీఎంసీ నీళ్లు అవసరం. దీంతో ఈ ప్రాజెక్టు కింద తాగునీటి కష్టాలు తప్పవనే ఆందోళన వ్యక్తమవుతున్నది. కరీంనగర్ నగరానికి ప్రధాన తాగునీటి వనరుగా ఉన్న ఎల్‌ఎండీలోనూ పరిస్థితి దారుణంగా ఉన్నది. నెల క్రితమే డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. 24.034 టీఎంసీల సామర్థ్యం కలిగిన ఎల్‌ఎండీలో ప్రస్తుతం 7.31 టీఎంసీలు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో కరీంనగర్ నగర ప్రజలకు మంచినీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నదని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు కరీంనగర్ నగరపాలక సంస్థకు సూచించారు. మిడ్ మానేరులోనూ పరిస్థితి ఆశాజనకంగా లేదు. కడెం, నిజాంసాగర్‌లోనూ మిషన్ భగీరథకు ఈ ఏడాది నీటి కష్టాలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

### డెడ్‌స్టోరేజీకి పడిపోయిన శ్రీశైలం

శ్రీశైలం ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 54 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఈ ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ లెవల్ 834 అడుగులు కాగా, ఇప్పటికే 833 అడుగులకు పడిపోయింది. అయితే, చిట్టచివరిగా 800 అడుగుల వరకు వెళ్లి నీటిని తీసుకునే అవకాశం ఉన్నది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ లెవల్ 510 అడుగులు కాగా, ఇప్పటికే నీటి నిల్వలు 519 అడుగులకు పడిపోయాయి. సాగర్‌లో వినియోగానికి సుమారు 16 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ వాటా కూడా ఉన్నది. హైదరాబాద్‌తోపాటు నల్లగొండ, ఖమ్మం ఉమ్మడి జిల్లాల తాగునీటి అవసరాలకు దాదాపు 16 టీఎంసీలు అవసరమని ఇప్పటికే అధికారులు అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ఇక్కడా తాగునీటికి తండ్లాట తప్పని పరిస్థితి నెలకొన్నది.

### డెడ్ స్టోరేజీకి మిషన్‌భగీరథ జలాశయాలు

వివిధ ప్రాజెక్టుల్లో భాగమైన పలు రిజర్వాయర్లను గ్రామాలకు తాగునీటిని అందించే మిషన్ భగీరథ పథకానికి గత ప్రభుత్వం అనుసంధానం చేసింది. అయితే, ప్రస్తుతం ఆయా రిజర్వాయర్లన్నీ ఇప్పటికే డెడ్ స్టోరేజీకి చేరుకోవడం ఆందోళన కలిగిస్తున్నది. పాలేరు రిజర్వాయర్ ద్వారా ఖమ్మం సహా ఐదు జిల్లాల్లోని 2,450 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించాల్సి ఉన్నది. పాలేరు పూర్తిస్థాయి నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 9 అడుగులకు నీటి నిల్వలు పడిపోయాయి. రిజర్వాయర్ సామర్థ్యం 2.558 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ఒక టీఎంసీ మాత్రమే ఉన్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగమైన ఎల్లూర్ రిజర్వాయర్‌లో నీటి నిల్వల పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉన్నది. కోయిల్‌సాగర్, రామన్‌పాడు, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, వైరా, పెండ్లిపాకల, ఉదయసముద్రం, గోపాలదిన్నె, శంకరసముద్రం, కుమ్రంభీం, మేడారం, భీమ్‌ఘన్‌పూర్, ధర్మసాగర్, చలివాగు తదితర ప్రాజెక్టులు మిషన్ భగీరథతో అనుసంధానమై ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే డెడ్ స్టోరేజీకి చేరుకోగా, మరో 15 రోజులు గడిస్తే మిగిలినవి కూడా డెడ్ స్టోరేజీకి చేరుకోనున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టులపై తాగునీటి అవసరాల కోసం ఆధారపడిన పట్టణాలు, పల్లెలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

---

## ఇరిగేషన్‌లో కీలకపోస్టులు భర్తీ

- ఈఎన్సీ జనరల్‌గా అనిల్‌కుమార్ నియామకం
- అడ్మిన్‌గా అమ్జద్ హుస్సేన్, ఓఅండ్ఎంకు శ్రీనివాస్

హైదరాబాద్, ఏప్రిల్23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఇరిగేషన్‌శాఖలో కీలక పోస్టులను ఎట్టకేలకు ప్రభుత్వం భర్తీ చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈఎన్సీ జనరల్‌గా గుమ్మడి అనిల్‌కుమార్, అడ్మిన్‌గా అమ్జద్ హుస్సేన్, ఓఅండ్ఎం ఈఎన్సీగా టీ శ్రీనివాస్‌ను నియమించింది. అలాగే ఇరిగేషన్‌శాఖ ఈఎన్సీ జనరల్‌గా మురళీధర్‌ను ప్రభుత్వం నిరుడు తొలగించి, ఈఎన్సీ అడ్మిన్ అనిల్‌కుమార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించింది. తాజాగా పూర్తిస్థాయిలో ఈఎన్సీ జనరల్‌గా అనిల్ కుమార్, ఈఎన్సీ అడ్మిన్‌గా అమ్జద్ హుస్సేన్‌కు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) ఈఎన్సీ విజయభాస్కర్‌రెడ్డి మార్చి 31న ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఆదిలాబాద్ సీఈ టీ శ్రీనివాస్‌ను ఈఎన్సీగా ప్రమోషన్ కల్పించింది. అలాగే ఎస్‌ఈ, వనపర్తి సీఈగా అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్న ఏఎస్‌ఎన్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ సీఈగా ప్రభుత్వం నియమించింది.

## మాజీ ఎమ్మెల్యే షకీల్ అహ్మద్‌కు బెయిల్

### రూ.10 వేల చొప్పున రెండు పూచీకత్తుల సమర్పణ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : పంజాగుట్ట పోలీసులకు మరోసారి భంగపాటు ఎదురైంది. స్టేషన్‌హౌస్ అధికారి శోభన్ సమక్షంలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అహ్మద్‌ను అరెస్టు చేసి బుధవారం కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఎందుకు అరెస్టు చేశారని అధికారులను మెజిస్ట్రేట్ ప్రశ్నించారు? హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని ఇవ్వాలని జడ్జి కోరారు. ఉత్తర్వు ప్రతిని న్యాయవాది అందించడంతో రిమాండ్‌కు తరలించకుండా షకీల్ అహ్మద్‌కు బెయిల్ మంజూరు చేస్తూ 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సౌమ్య ఆదేశాలిచ్చారు. రూ.10 వేల చొప్పున ఇద్దరి జమానత్‌లను కోర్టుకు సమర్పించి పర్సనల్ బాండ్ అందించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు.

---

## ప్రభుత్వ సదస్సా? కాంగ్రెస్ కార్యక్రమమా?

**25, 26న హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్'**

- పేరుకే సర్కార్ సదస్సు, హంగామా కాంగ్రెస్‌దే
- తొలిరోజు రాహుల్, ఖర్గేదే కీలక ప్రసంగం
- ముగింపురోజున ప్రియాంక, కేసీ ఉపన్యాసం
- సొమ్ము సర్కార్‌ది.. సోకు కాంగ్రెస్ పార్టీది
- రాష్ట్ర ప్రభుత్వ తీరుపై వెల్లువెత్తిన విమర్శలు

హైదరాబాద్, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరంలో ఈ నెల 25, 26 తేదీల్లో 'భారత్ సమ్మిట్-2025' సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ సదస్సులో 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు పాల్గొంటారని ప్రభుత్వమే ప్రకటించింది. 100 పార్టీల తరపున 40 నుంచి 50 మంది మంత్రులు, 50 మంది సెనేటర్లు, ఎంపీలతోపాటు రాజకీయ పార్టీల అధినేతలు పాల్గొంటారని ప్రకటించింది. కానీ, ఇది పేరుకే ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రపంచస్థాయి సదస్సు.. అందులో పాల్గొనేవారు, ప్రసంగించే కీలక వ్యక్తులంతా కాంగ్రెస్ అగ్రనేతలే. సదస్సు ఆరంభం రోజున లోక్‌సభ కాంగ్రెస్ పక్షనేత రాహుల్‌గాంధీ కీలక ప్రసంగం చేస్తారు. ముగింపు రోజున కాంగ్రెస్ ఎంపీలైన ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్ ఉపన్యసిస్తారు. అంటే ఈ సదస్సు కాంగ్రెస్ అగ్రనేతల ప్రసంగంతో మొదలై, కాంగ్రెస్‌లో కీలక నేతల ప్రసంగంతో ముగుస్తుంది. దీంతో ఇది ప్రభుత్వ కార్యక్రమమా? లేక కాంగ్రెస్ పార్టీ కార్యక్రమమా? అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ప్రారంభ, ముగింపు సభల్లో మాట్లాడేందుకు కాంగ్రెస్ అగ్రనేతలు కాకుండా వేరే ప్రముఖులు ఎవరూ దొరకలేదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా ప్రపంచ న్యాయం, సమానత్వం, ప్రగతిశీల సహకారం, ద్వైపాక్షిక బంధాలపై చర్చలు జరగనున్నాయి. కానీ, కార్యాచరణ, అందులో పాల్గొనే అతిథులను పరిశీలిస్తే మాత్రం ఇది ప్రపంచ సదస్సు కాదు.. పక్కా కాంగ్రెస్ సదస్సు అనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### సన్నాహక మీటింగ్‌లోనూ కాంగ్రెస్ నేతలే హాజరు

ఇటీవల భారత్ సమ్మిట్ సదస్సు సన్నాహక సమావేశాన్ని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కీలక నేత శ్యాంపిట్రోడ ఆన్‌లైన్ ద్వారా హాజరై ప్రసంగించారు. ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ స్వయంగా హాజరయ్యారు. ఈ విధంగా సమావేశాలు మొత్తం పార్టీ నేతలతో నిర్వహిస్తూ, ప్రభుత్వం పేరు చెప్పుకోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ కార్యక్రమాల కోసం ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారని, ప్రజల సొమ్మును పార్టీకోసం ఖర్చు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొసమెరుపు ఏమిటంటే? భారత్ సమ్మిట్ సదస్సు కార్యక్రమ వివరాలను వెల్లడించేందుకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన నివాసమైన ప్రజాభవన్‌లో ఎంపిక చేసిన మీడియాతో భారీస్థాయిలో విందు ఇవ్వడం గమనార్హం.